క్లుప్తంగా

వీరాంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేకలంకరణలో వీరాంజనేయస్వామి

దుత్తలూరు: హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని దుత్తలూరు మండలంలోని వెంకటంపేట ప్రధాన రోడ్డుపక్కన ఉన్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

జమ్ములో మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సంగం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని పొలాల్లో ఉన్న జమ్ములో శుక్రవారం మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సబ్‌స్టేషన్ సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, ఎస్సై నాగార్జునరెడ్డికి సమాచారం అందించా రు. వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ మంటల కారణంగా ఆ ప్రాంతంలో అక్కడక్కడా 11 కేవీ విద్యుత్ తీగలు స్వల్పంగా దెబ్బతిన్నాయి.

ఎంఈఓకు ఘన సన్మానం



ఎంఈఓ బాలకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

సోమశిల: అనంతసాగరం ఎంఈఓ–1గా పనిచేసిన బాలకృష్ణారెడ్డి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా అనంతసాగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మండల అధికారులు ఆయనను ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకరరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ మండల అధ్యక్షుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాన్పుల సంఖ్య పెంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ దయాకర్

దుత్తలూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయాలన్నారు. ఫార్మసీ రూము, కాన్పుల గదిని పరిశీలించారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్, సూపర్‌వైజర్ ఖాజామొహిద్దిన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు



చేజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని డాక్టర్ పవన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆదూరుపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో జరిగిన వైద్యశిబిరంలో ఆయన పాల్గొని వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. సుమారు 50 మంది రోగులను పరీక్షించారు. ముగ్గురు గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది నీరజ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

క్షయ నివారణే ధ్యేయం

- ముమ్మరంగా అడల్ట్ బీసీజీ టీకా



బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

దుత్తలూరు: మనిషి ఆరోగ్యంపై దాడి చేసే క్షయ వ్యాధి కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే ఈ వ్యాధి నివారణకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతోంది. పుట్టిన తర్వాత పిల్లలకు ఎడమవైపు భుజానికి ముద్ర టీకా వేస్తారు. ప్రస్తుతం పెద్దలకు సంబంధించి అడల్ట్ బీసీజీ టీకా అందుబాటులోకి వచ్చింది. ఒకప్పుడు టీబీ పేరు వింటేనే హడలిపోయేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పెద్దలకు వ్యాక్సిన్ అందుబాటులోకొచ్చింది. ఈ వ్యాధి ఏ వయస్సు వారికైనా సంక్రమించే అవకాశముంది. ఇది ఒక అంటువ్యాధి కాగా ఈ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వం ఆస్పత్రుల ద్వారా ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలతోపాటు వైద్యసేవలు అందిస్తోంది. దీంతో చాలా వరకు క్షయవ్యాధి నియంత్రణలోకొచ్చింది. అయితే గతంలో కేవలం చిన్నపిల్లలకు ఎడమచేతి భుజానికి ముద్ర టీకా వేసేవారు. తాజాగా ప్రభుత్వం పెద్ద వయస్సు వారికి సంబంధించి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమైంది. గురువారంతో ఈ కార్యక్రమం మూడు వారాలకు చేరింది. ఇప్పటివరకు జిల్లాలో 20 వేల మందికి వైద్యసిబ్బంది టీకాలు వేశారు. మొత్తం సుమారు 6 లక్షల మందికిపైగా వ్యాక్సిన్ వేయడానికి వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఈ టీకాను అర్హులైన వారికి అన్ని సచివాలయాల్లో ప్రతి గురువారం ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు ఉచితంగా వేస్తారు.

టీకా పొందడానికి అర్హులు

అరవై ఏళ్లు పైబడిన వారు, గడిచిన ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయిన వారు, టీబీ వ్యాధిగ్రస్తులకు సన్నిహితంగా ఉన్నవారు. అదే 18 ఏళ్లు నిండిన వారిలో అయితే పొగతాగేవారికి, షుగరు వ్యాధి ఉన్నవారికి, బీఎంఐ–18 కన్నా అత్యంత బలహీనంగా ఉన్నవారు ఈ వ్యాక్సిన్ వేసుకోవడానికి అర్హులు.

అనర్హులు వీరే

ప్రస్తుతం టీబీ వ్యాధితో మందులు వాడేవారు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులు, వ్యాక్సిన్ వేయించుకునే సమయంలో జ్వరం, జలుబు, దగ్గు ఉన్నవారు, వ్యాక్సిన్ వేసినప్పుడు రియాక్షన్ వచ్చేవారు. కిడ్నీ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకొని మందులు వాడేవారు, రక్తదానం చేసిన మూడు నెలల వరకు, 18 ఏళ్లు దాటిన వారు ఈ టీకా వేసుకోకూడదు.

> **ఉచితంగా టీకా**
>
> క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా తొలిసారిగా 18 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకా వేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ వ్యాక్సిన్ ప్రతి గురువారం హెల్త్ సెంటర్లలో ఉచితంగా అందిస్తారు. సర్వేలో గుర్తించిన వారంతా విధిగా ఈ వ్యాక్సిన్ వేసుకోవాలి. జిల్లాను క్షయ రహితంగా చేయడమే లక్ష్యం.
>
> – డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా క్షయ నివారణ అధికారి

అవ్వాతాతల్లో పింఛన్ టెన్షన్



పింఛన్ నగదు తీసుకునేందుకు బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

సీతారామపురం: అవ్వాతాతలను పింఛన్ టెన్షన్ వెంటాడుతోంది. ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు అండ్ కో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వలంటీర్ల సేవలు దూరమైన సంగతి విదితమే. ఈ తరుణంలో గత రెండు మాసాలుగా ఇంటి వద్దకు పింఛన్ అందక అవ్వాతాతలు నానా అగచాట్లు పడుతున్నారు. జూన్ నెలలోనూ చంద్రబాబు పుణ్యమా అని పింఛన్ కోసం తిప్పలు తప్పవని అవ్వాతాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 3.14 లక్షల మంది పింఛన్‌దారులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మార్చి నెల వరకు పింఛన్ నగదును లబ్ధిదారుల ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా అందించింది. ఎన్నికల నేపథ్యంలో విపక్షాల ఫిర్యాదుతో ఈసీ ఆదేశాల మేరకు గత రెండు నెలలుగా 2,28,471 మందికి బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు జమ చేస్తున్నారు. కేవలం 85,951 మందికి మాత్రమే ఇంటి వద్దకే వచ్చి సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకుల్లో నగదు తీసుకోవడం అవ్వాతాతలకు తలకు మించిన భారంగా మారింది.

> **వలంటీర్ల ద్వారా ఇస్తే బాగుండు**
>
> 
>
> రెండు నెలల క్రితం వరకు ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవాడు. బ్యాంకుల్లో జమ చేయడం ద్వారా ఇబ్బందులు పడుతున్నాం. ఎండలు మండుతున్నాయి. బ్యాంకు దగ్గరకు పోయి పడిగాపులు కాయాలంటే కష్టంగా ఉంది. పింఛన్ వలంటీర్ల ద్వారా ఇస్తే బాగుంటుంది.
>
> – గెట్టిబోయిన పుల్లయ్య, పంద్రంగి

నేడు సర్వసభ్య సమావేశం

సోమశిల: అనంతసాగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ తాజ్ మస్రూర్ తెలిపారు.

వీఆర్వో మృతి

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని కంభంపాడు పంచాయతీలో వీఆర్వోగా పనిచేస్తున్న మంగల పెంచలయ్య (59) నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. రెవెన్యూ సిబ్బంది వివరాల మేరకు మూడు రోజుల క్రితం అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన పెంచలయ్య గుండెపోటుతో మృతిచెందాడు. పెంచలయ్య మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పింఛన్ల నగదు బ్యాంకు ఖాతాలకు జమ

జలదంకి: వైఎస్సార్ పింఛన్ కానుక నగదును జూన్ ఒకటో తేదీన డీబీటీ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఎంపీడీఓ కె.రామచంద్ర శుక్రవారం తెలిపారు. బ్యాంక్ ఖాతాలు ఆధార్‌తో లింక్ అయిన వారికి డీబీటీ విధానంలో పింఛన్ నగదు జమ అవుతుందని తెలిపారు. సచివాలయం వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు. బ్యాంక్ ఖాతాలు లేనివారు, ఆధార్‌తో లింక్ కాని వారికి సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకొచ్చి పింఛన్ నగదు పంపిణీ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

నేడు వేడుకగా హనుమాన్ జన్మోత్సవం

- ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలకు ఏర్పాట్లు



విద్యుద్దీపాలంకరణలో ఆత్మకూరు బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయం

ఆత్మకూరు: రామభక్తుడు హనుమంతుని జన్మోత్సవాన్ని పురస్కరించుకొని ఆత్మకూరు పట్టణంలోని పలు రామాలయాల్లో, ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించనున్నారు. హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా పంటవీధి రామాలయంలో స్వామివారికి సింధూర పూజలు, అనంతరం లక్ష తమలపాకులతో సహస్ర నామ పూజలు, హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఒంటె వాహనంపై ఆంజనేయస్వామికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆత్మకూరు బైపాస్ రోడ్డు వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, తమలపాకులతో ఆకుపూజ, హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల సమయంలో ఆత్మకూరు పట్టణం నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు సువర్చలాదేవి సమేత ఆంజనేయస్వామి కల్యాణం, భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 60 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహానికి పాలాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులతో కూచిపూడి, భరతనాట్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి పండరి భజన, అనంతరం అగ్నిగుండం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అలా గే పట్టణంలోని ఆర్యవైశ్యులు నిర్మించిన కోదండ రామాలయంలో, అలఘునాథస్వామి ఆలయంలో హనుమంతునికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హనుమాన్ జన్మోత్సవానికి ఏర్పాట్లు

కలిగిరి: మండలంలో శనివారం హనుమాన్ జన్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. కలిగిరిలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆంజనేయస్వామి ఆలయం, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆంజనేయస్వామి విగ్రహం, జిర్రావారిపాళెంలోని అభయాంజనేయస్వామి విగ్రహం, కమ్మవారిపాళెంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జన్మోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

కొండాపురం మండలంలో..

కొండాపురం: హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా శనివారం కొండాపురం మండలంలోని మర్రిగుంట, కొమ్మి, సాయిపేట తదితర గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

ఏర్పాట్లు పూర్తి

వరికుంటపాడు: హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వరికుంటపాడు మండలంలోని వరికుంటపాడు, విరువూరు, తూర్పుబోయమడుగుల తదితర గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. స్వామివారికి ఉదయం నుంచి సుగంధ ద్రవ్యాలు, ప్రచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, ఆకుపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేయనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

ఆత్మకూరు మండలంలో..

ఆత్మకూరురూరల్: హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆత్మకూరు మండలంలోని రామస్వామిపల్లి, మహిమలూరు, మురగళ్ల, గండ్లవేడు, కరటంపాడు, అప్పారావుపాళెం, బట్టేపాడు, వాశిలి తదితర గ్రామాల్లో అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. ఆయా గ్రామాల్లోని అంజనేయస్వామి విగ్రహాల వద్ద స్వామివారికి విశేష పూజలు, భక్తులకు అన్న సంతర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

చేజర్ల మండలంలో..

చేజర్ల: హనుమాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చేజర్ల మండలంలోని చేజర్ల, యనమదల, కాకివాయి తదితర గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న జిల్లా కోఆర్డినేటర్ మాల్యాద్రి



జలదంకి: శిక్షణ ఇస్తున్న విద్యాశాఖ అధికారులు

సంగం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం జిల్లా కోఆర్డినేటర్ మాల్యాద్రి, ఎంఈఓ మల్లయ్య సంగం మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాలు కలిగిన వంట వండడం, వంటగదిలో పరిశుభ్రత, విపత్తులు ఎదురైన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనే విషయాలపై పలు సూచనలు చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం విద్యార్థులు భోజనం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా జిల్లావ్యాప్తంగా మాస్టర్ ట్రినర్స్‌తో కలిపి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రెనర్ మోహన్, మిడ్ డే మీల్స్ మాస్టర్ ట్రెనర్ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వనరుల కేంద్రంలో..

జలదంకి: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శుక్రవారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ–1 కె.శ్రీధర్, ఎంఈఓ–2 సీహెచ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ పోషకాహార సంస్థ సంయుక్తంగా రూపొందించిన పౌష్టికాహార మెనూను మరింత పటిష్టంగా అమలు చేసేలా అవగాహన కల్పించారు. అనంతరం స్టేట్ రిసోర్స్‌పర్సన్ కె.తిరుపతిస్వామి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడంతోపాటు రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రవిచంద్ర, మాధవ, కొండలపావు, శ్రీనివాసులు, శ్యామల, రమేష్, రాధ తదితరులు పాల్గొన్నారు.

భానుడు భగభగ



నిర్మానుష్యంగా సీతారామపురం బస్టాండ్ సెంటర్

సీతారామపురం: భానుడి ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణి కార్తెలో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో గత రెండ్రోజుల నుంచి మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. జనసంచారం లేక రోడ్లు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండతీవ్రత కొనసాగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అత్యవసర పని ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొనడంతో రహదారులు, ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

రికార్డులు సక్రమంగా నిర్వహించండి



రికార్డులు పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ దయాకర్

సీతారామపురం: పీహెచ్‌సీలో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ పీఎల్ దయాకర్ సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్న చిన్న లోపాలు సరిదిద్దుకొని ప్రజారోగ్య పరిరక్షణపై దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. ఆర్‌సీహెచ్ సర్వీసులపై అవగాహన కల్పించి హైరిస్క్ పేషంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ల్యాబ్ ఫార్మసీ, డెలివరీ, వ్యాక్సిన్ భద్రపరిచే గదులతోపాటు ఇన్‌పేషెంట్ సర్వీసును నిశితంగా పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలందించారు. కార్యక్రమంలో వైద్యురాలు స్వప్నారెడ్డి, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, ఎంపీహెచ్ఈఓ మజీద్, ఫార్మాసిస్ట్ శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్ షబనా, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు వినియోగించుకోండి



రొంపిదొడ్లలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది

వరికుంటపాడు: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆయేషా సూచించారు. ఆమె శుక్రవారం మండలంలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మందికి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇంటి వద్దకే వైద్యసిబ్బంది వచ్చి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు డిస్కం ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నర్రవాడ ఫీడర్ పరిధిలో ఉదయం 9.45 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, వెంగనపాళెం ఫీడర్ పరిధిలో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు త్రీఫేజ్ సరఫరా ఉంటుందని తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా వెంగనపాళెం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

21వ రౌండ్‌లోనే అత్యధిక ఓట్లు

- నియోజకవర్గానికి 24 రౌండ్లు కేటాయింపు
- నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 323
- అత్యల్పంగా 8వ రౌండ్‌లో 7,020 ఓట్లు

దుత్తలూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న జరగనుంది. ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం 323 పోలింగ్ కేంద్రాలు ఉండడంతో లెక్కింపు ప్రక్రియ 24 రౌండ్లతో పూర్తవుతుంది. పోలింగ్ బూత్‌ల వారీగా లెక్కిస్తే 21వ రౌండ్‌లో 11,021 అత్యధిక ఓట్లు, 8వ రౌండ్‌లో 7,020 అత్యల్ప ఓట్లు లెక్కింపు జరగనుంది. నియోజకవర్గంలో మే 13న జరిగిన ఎన్నికల్లో 1,97,970 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. దీంతో పాటు మరో 2,827 పోస్టల్ బ్యాలెట్ ఓట్లున్నాయి. ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నెల్లూరులోని ప్రియదర్శిని కాలేజీలో జరగనుంది. అసెంబ్లీ కౌంటింగ్‌కు గాను ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లు కేటాయించారు. 23 రౌండ్లు పూర్తయ్యాక 24వ రౌండ్‌లో జలదంకి మండలం చామదల హరిజనవాడకు చెందిన సింగిల్ ఈవీఎంతో కౌంటింగ్ ప్రక్రియ ముగుస్తుంది.

నేత్రపర్వం..శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. కల్యాణోత్సవానికి పెంద్యాల రమణయ్యనాయుడు, విజయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం గజవాహనంపై ఉభయదేవేరులతో కలిసి శ్రీవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. గజ వాహన సేవకు ఉభయకర్తలుగా జీ అశోక్, సునీత, పీ సుబ్బానాయుడు, పద్మజ దంపతులు వ్యహరించారు. మధ్యాహ్నం హంస వాహన సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. హంస వాహన సేవకు జ్యోతి, మాల్యాద్రి, మంజుల ఉభయకర్తలుగా వ్యహరించారు. సాయంత్రం శ్రీవారు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయకర్తలుగా కోనం చినబ్రహ్మయ్య, హైమావతి, వాకాటి శ్రీనివాసులురెడ్డి సంధ్య, చొప్పా వెంకటేశ్వర్లు, మంజుల, వరదారెడ్డి, లలితమ్మ, లోకనాథం, సునీత, ప్రసాద్‌నాయుడు, అరుణ, రాంబాబు, శ్రావణి దంపతులు వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాత్రి చెక్కభజన ఏర్పాటు చేశారు.